తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ప్రణాళికాబద్ధంగా శ్రీచెంగాళమ్మ తిరునాళ్లు

- చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి



సూళ్లూరుపేట, జూన్ 2 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీచెంగాళమ్మ తిరునాళ్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తిరునాళ్లను విజయవంతం చేసేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీ కోఆర్డినేటర్లు అందరినీ సమన్వయపరచుకొని ప్రతి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తారన్నారు. ప్రతి కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారని, వీరి ద్వారా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. తిరునాళ్లకు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు, మహిషాసురమర్దని నిర్వహించేందుకు ఆలయానికి కొంత దూరంలో ఉన్న నూతన మైదానంలో ఈ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రాంతంలో భక్తులకు మంచినీరు, ఎండవేడిమికి తట్టుకునేందుకు తాత్కాలిక షెడ్లు, రంగులరాట్నాలు, ఆహ్లాదపరిచే పలు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఆలయం ముందుభాగంలోని ఖాళీస్థలాల్లో, కాళంగి బ్రిడ్జి దక్షిణం వైపు ఖాళీస్థలంలోనూ పార్కింగ్ చేసుకోవాలని బాలచంద్రారెడ్డి సూచించారు. ఇందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శ్రీచెంగాళమ్మ మైదానానికి వెళ్లే మార్గాలు, రైల్వేస్టేషన్ నుంచి ఒక మార్గం, మరో మూడు మార్గాలు వాటంబేడు రోడ్డు నుంచి ఏర్పాటు చేసి ఉన్నారన్నారు. ప్రజలు ఇంట్లో పండుగలాగా తిరునాళ్ల నిర్వహించేందుకు తోడ్పాటునందించాలని బాలచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. కమిటీల ద్వారా ఆహారం, మంచినీరు, ట్రాఫిక్, శాంతిభద్రతలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు కర్లపూడి సురేష్‌బాబు, ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండి సునీత, నాగమణి, మారెమ్మ, ఓలేటి బాలసత్యనారాయణ, వంకా దినేష్, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాది రైతు పక్షపాతి ప్రభుత్వం!

- వైఎస్ఆర్ యంత్రసేవా పథకంను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభభిస్తున్న రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త: వ్యవసాయ పంటల సాగుకు రైతుల కోసం పగటి పూటే 9 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తూ తమది రైతు పక్షపాతి ప్రభుత్వంగా పేరు గడిస్తోందని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద మంజూరైన ట్రాక్టర్లను శుక్రవారం చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలోని 237 సంఘాలకు 4.17 కోట్ల రూపాయల రాయితీతో 111 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి వైఎస్ఆర్ యంత్రసేవా కార్యక్రమంను గుంటూరు నుండి శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తే జిల్లా స్థాయి కార్యక్రమంను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలో అధిక సంఖ్యలో వ్యవసాయంపై ఆధారపడి వున్నారన్నారు. రైతు గిట్టుబాటు ధర కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. అసంపూర్తిగా వున్న కుప్పం బ్రాంచి కెనాల్ పనులు రెండు నెలల్లో పూర్తి చేసి కుప్పం ప్రాంతంలోని అన్ని చెరువులను నీటితో నింపడం జరుగుతుందన్నారు. పడమటి ప్రాంతాల్లోని ప్రజలకు సాగు, మంచినీరు అందించడానికి మూడు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది అర్హులకు ఇళ్లను మంజూరు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందుతున్నాయన్నారు. కులాలు, మతాలకు అతీతంగా రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తోందన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతులకు పండుగ వచ్చిందన్నారు. రైతులకు రైతు భరోసా పథకం కింద పంట సాగుకు ఆర్థిక సహాయం అందించడం, ఆర్‌బికెల ద్వారా రైతుకు అవసరమైన పనిముట్లు, పరికరాలు పంపిణీ చేసి ప్రభుత్వం రైతును రాజు చేస్తోందన్నారు. ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా మంజూరు చేసి సిఎం రైతుకు న్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ, డిఆర్‌ఓ రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ డిడి మధు సూధన్‌రెడ్డి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ డాక్టర్ రేణుక, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ మురళీ, మేయర్ అముదు, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, ఐసిడిఎస్ రాయలసీమ జోనల్ ఛైర్మన్ శైలజారెడ్డి, పలమనేరు-కుప్పం-మదనపల్లి అర్బన్ అథారిటీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ యంత్ర సేవా పథకంచే...

# రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతుంది

-జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి



యంత్ర సేవ పథకంలో భాగంగా పంపిణీకి సిద్ధంగా వున్న ట్రాక్టర్లు

తిరుపతి కలెక్టరేట్, జూన్ 2ప్రభాతవార్త : రైతుల అవసరాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సాగు అవసరాలను తీర్చి పెట్టుబడి ఖర్చులు తగ్గించడానికి వైఎస్ ఆర్ యంత్ర సేవా పథకం అమలు చేస్తున్నదని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ యంత్ర సేవా పథకంలో భాగంగా 2023-24 సంవత్సరంకు ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లను గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్ర కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా చుట్టుగుంట సర్కిల్ నుండి జెండా ఊపి ప్రారంభించగా తిరుపతి జిల్లాలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం 2 జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు గ్రూపులకు పెట్టుబడి భారం లేకుండా కేవలం 10 శాతం పెట్టుబడితో, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రాయితీ, బ్యాంకు రుణం 50 శాతం వంటివి ప్రభుత్వమే భాద్యత తీసుకుని వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం అమలు చేస్తున్నదని అన్నారు. జిల్లాలో సన్న, చిన్న కారు రైతులకు అద్దె ప్రాతిపదికన అందించుటకు ప్రతి రైతు బరోసా కేంద్రం పరిధిలో రైతుల భాగస్వామ్యంతో సిహెచ్‌సిలు ఏర్పాటు చేసి వ్యవసాయంలో యాంత్రీకరణ అమలు చేసి రైతు పెట్టుబడి తగ్గించడమే లక్ష్యం అని అన్నారు. జిల్లాలో 445 రైతు భరోసా కేంద్రాలకుగాను 429 కేంద్రాలలో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. నేడు జిల్లాలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం మెగా మేళా రెండవ విడతలో భాగంగా 160గ్రూపులకు రూ.13.69 కోట్ల విలువ గల వ్యవసాయ పనిముట్ల రూ. 4.58 కోట్ల సబ్సీడీ అందించడం జరిగిందని అన్నారు. నేడు ట్రాక్టర్లను 74 టాక్టర్లు అందిస్తున్నామని, గతంలో 140 టాక్టర్లు అందించిన విషయం తెలిసిందేనని అన్నారు. వ్యక్తిగతంగా ఇవ్వడం వల్ల సదరు వ్యక్తి యాంత్రీకరణకు పేద రైతులవద్ద అధిక అద్దె తీసుకునే అవకాశం వుంటుందని, ఇప్పుడు తక్కువ ధరకే రైతు యంత్ర సేవ ఉపయోగించుకోగలుగుతాడని అన్నారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ఆవరణలో 160 సిహెచ్‌సి సంఘాల రైతు గ్రూపులకు రూ. 4.58 కోట్ల సబ్లీడీ మెగా చెక్కును అందించి, జిల్లాకు నేడు మంజూరు కాబడిన ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెవి రెడ్డి మోహిత్ రెడ్డి, జెడి వ్యవసాయ శాఖ ప్రసాద్ రావు, సిహెచ్‌సి సంఘాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# అశ్వంపై గోవిందుడు కటాక్షం



తిరుపతి,జూన్ 2 ప్రభాతవార్త: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి చివరివాహనంగా అశ్వవాహనంపై కల్కిఅలంకారంలో గోవిందుడు భక్తులను కటాక్షించాడు. కలియుగాంతంలో స్వామి కల్కిమూర్తియై గుర్రంపై పయనిస్తూ ,ఖడ్గధారియై దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తాడని పురాణాలు పేర్కొన్నాయి. ఈ అశ్వవాహనత్వం, కల్కి అవతారాన్ని గుర్తుచేస్తుంది. సాయంత్రం వసంతోత్సవం జరిగింది.

**-ఉదయం వేడుకగా రథోత్సవం:**

తిరుపతిలోని గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులు ఉదయం రథంపై అధిరోహించి భక్తకోటిని కటాక్షించారు. భక్తులే అశ్వాలుగా గోవింద నామ స్మరణల మధ్య అత్యంత భక్తివిశ్వాసాలతో లాగిన ఈ రథోత్సవం మాఢవీధుల్లో కన్నులపండువగా సాగింది. వాహనసేవల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, కంకణభట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు,ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

# పనుల్లేని అధికారులకు... రూ.లక్షల్లో జీతాలు

-పనిలేని పర్మినెంట్ ఉద్యోగులు
-పెత్తనం చెలాయిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు
-శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలన తీరు!



శ్రీకాళహస్తి,జూన్ 2 ప్రభాతవార్త : దేవాదాయశాఖ పని తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలనా తీరు పరిశీలిస్తే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది. ఈ ఆలయంలో కొందరు అధికారులను ఎలాంటి పని లేకుండా ఒక్క ఫైల్ చూసే అవకాశం లేకుండా ఓ ఎసి గది చక్కటి ఫర్ని చర్‌ను అందించి నెలకు రూ.1.2లక్షలు జీతం చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆలయంలో ఇద్దరు ఎసిలున్నారు. ఏ కారణాల చేతనో మరో ఎసిని పెంచల కోన నుంచి ఇక్కడకు బదిలీ చేసారు. ఇక్కడ ఉన్న ఇద్దరు ఎసిలే గోళ్లు గిల్లుకుంటూ నెల వచ్చేసరికి టంఛన్‌గా జీతాలు తీసుకుంటుండగా, మరో అధికారిని తీసుకురావటంలో ఆంతర్యమేమిటని చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిబంధనలకు తిలోదకాలిచ్చి బిల్లులు చెల్లింపుకు వత్తిడి వస్తున్నట్లు సమాచారం.

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో సిబ్బంది ఇలా ఉన్నారు :**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ సారి సిబ్బంది పరిశీలిస్తే నలుగురు ఎఇఒలు ఉండాల్సి ఉండగా నలుగురు ఉన్నారు. అలాగే సూపరింటెండెంట్‌లు 5మందికి 5 మంది ఉన్నారు. అయితే సీనియర్ అసిస్టెంట్లు కూడా కేడర్ సంఖ్య ప్రకారం ఉన్నారు. అయితే ఫైళ్ళు రాయాల్సిన జూనియర్ అసిస్టెంట్ల సంఖ్య లేదు. ఎవరైతే రిటైర్ అవుతున్నారో వారి స్థానంలో కొత్తవారిని నియమించటం లేదు.దాంతో ఫైళ్ళు రాసే సిబ్బంది కొరత ఏర్పడింది.

**అవుట్ సోర్సింగ్ పెత్తనం... రెగ్యూలర్ సిబ్బంది ఖాళీ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలన పరిస్థితి పరిశీలిస్తే అర్హత కల్గిన అధికారులు ఎలాంటి అధికారా లేకుండా ఫైళ్ళను చూడకుండా నెలకు లక్షలు జీతాలు తీసుకుంటూ ఉన్నారు. కానీ ఇక్కడ కొందరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం చెలాయిస్తున్నారంటే పాలన తీరు అర్థమౌతుంది. పచ్చదనాన్ని కాపాడాల్సిన ఉద్యోగులు తమ ఆదాయాల కోసం అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు ఆలయంలో పని చేస్తున్నారు. ఆదాయాలు వచ్చే రాహుకేతుదోష నివారణ మండపాల్లో విధులు వేసుకుంటున్నారు. రెగ్యూలర్ సిబ్బంది కనీసం గేట్ల వద్ద కూడా పనికి రారు అన్నట్లు మౌనంగా ఉన్నారు. అస్మదీయులకు ఆదాయాలు కల్పించుటకు అధికార పార్టీకి చెందిన సిఫార్సులతో డ్యూటీలు సంపాదిస్తున్నారు.

**ఫైల్ వస్తే సంతకం పెట్టాలి:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గతంలో పారదర్శకతకు మారు పేరుగా ఉండేది. అయితే నేడు నిబంధనలు గాలికి పోయాయి. ఏ బిల్లు అయినా సీటుమీదకు వస్తే ఏమీ పరిశీలించకుండా సంతకాలు చేసే ఉద్యోగి కావాలి? నిబంధనలు పాటించే వారు అవసరం లేదన్నట్లు పరిస్థితి మారింది. కొందరు ఉన్నతాధికారులకు ఎలాంటి పని లేకుండా జీతాలు తీసుకుంటే అధికారులు చెల్లిస్తున్నారంటే, ఇది ఏమి పరిపాలన అని చూపరులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా పరిపాలనలో పారదర్శకతకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి ముక్కంటీశుడు ఎప్పటికి తమ పరిపాలనను సరిదిద్దుకుంటారో ఏమో ?

# ఇక ప్రజాక్షేత్రంలోకి... పార్టీ కేడర్ !

ఎన్నికలకు అధికార పార్టీ సమాయత్తం అడుగులు -నేడు తిరుపతిలో వైసిపి శ్రేణుల సమావేశం



ప్రభాతవార్త-తిరుపతి:

ఎన్నికలకు మరో తొమ్మిదినెలల సమయం ఉండగానే ప్రజల నాడి తెలుసుకుని ఆ దిశగా ప్రజల ఆశయాలు, అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేందుకు అధికార వైసిపి నేతలు సిద్దమవుతున్నారు. ఇందుకు 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎమ్మెల్యేలు, ప్రాంతీయ కన్వీనర్లుతో శనివారం తిరుపతిలో కీలక సమావేశం కానున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 175 స్థానాల్లో గెలవాలనే లక్ష్యాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా ధృడసంకల్పంగా ఉన్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలతో స్పష్టం చేశారు. అందుకు ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వైసిపికి ముఖ్యసలహాదారులుగా ఉన్న ఐప్యాక్ సిబ్బంది కూడా రంగంలోకి దిగనున్నారు. ఓ వైపు ప్రజల నాడిని తెలుసుకుని మరోవైపు ప్రతిపక్షాల విమర్శలను బలంగా తిప్పికొట్టేందుకు వ్యూహాన్ని సిద్ధం చేసుకొంటున్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి దోహదపడిన నవరత్నాల పథకాలు మళ్ళీ అమలుచేస్తే ప్రజల అభిప్రాయం ఎలా ఉంది, కొత్తగా ప్రజలు ఏమైనా ఆశిస్తున్నారా,వారి సూచనలు, సలహాలు తీసుకునేందుకు అధికార వైసిపి కార్యాచరణతో ముందుకు వస్తోంది. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తీరు వంటివాటిపై కూడా నేటి సమా వేశంలో ప్రధానంగా చర్చించి, వీటిపై ప్రజా వ్యతిరేకత ఏక్కడైనా ఉందా ?అనే కోణంలో సర్వే చేయనున్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 నియోజకవర్గాలకు గాను 13 చోట్ల వైసిపి ఎమ్మెల్యేలు గెలిచి ప్రస్తుతం సిట్టింగ్‌లుగా కొనసాగుతున్నారు. ముగ్గురు మంత్రులుగా, ఒకరు ప్రభుత్వ విప్‌గా, టిటిడి బోర్డు సభ్యులుగా ఉన్నారు. జిల్లాల విభజనతో తిరుపతి, చిత్తూరు జిల్లాలో డివిజన్లు మార్పు చేయడం, వీటి వల్ల కొన్ని మండలాల ప్రజల సమస్యలు వంటివి ఉన్నాయి. కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేల పని తీరుపై జనంలో వ్యతిరేకత ఉంది. వీటన్నిటినీ సానుకూలంగా మలుచుకుని మళ్ళీ తిరుపతి, చిత్తూరు జిల్లాలో అసెంబ్లీ స్థానాలను కైవశం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

# యోగ నరసింహుని అవతారంలో ప్రసన్న వేంకటేశ్వరుడు



సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు



ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారి దివ్యదర్శనం

పుత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త : అప్పలాయి గుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు ఉదయం సింహ వాహనంపై యోగ నరసింహుని అవతారంలో, రాత్రి ముత్యపు పందిరి వాహనాలపై విహరిస్తూ భక్తులకు కనవిందు చేశారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మూల విరాట్టుకు అభిషేకం, అలంకరణ వైభవంగా జరిపించారు. ఉదయం 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న శ్రీవారు సర్వలంకార భూషితుడై అలంకరించిన సింహ వాహనాన్ని అధిరోహించి మాడ వీధుల్లో విహరిం చారు. స్వామివారికి స్థానిక భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. వాహనానికి ముందు భక్తులు భక్తి పారవశ్యంతో కోలాటాలు, భజనలు చేస్తూ ముందుకు సాగారు. తొమ్మిది గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న ప్రసన్న వేంకటేశ్వరునికి, అమ్మవారికి స్నపన తిరుమంజనం గావించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకిం చారు. రెండవ గంట అనంతరం సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకూ ఊంజల్ సేవలో శ్రీవారు ఉభయ దేవేరీల సమేతంగా ఊయల ఊగుతూ భక్తులకు కనువిందు చేశారు. రాత్రి 7.00 గంటలకు వాహన మండపం చేరుకున్న శ్రీవారు సర్వాంగ సుందరంగా అలంకృతుడై అలంకరించిన ముత్యపు పందిరి వాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, ఎఇఒ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయాధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారా చార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.

# ఐరాలలో ఆగని గజరాజుల దాడులు

-చుక్కావారిపల్లె వద్ద పంటలు, గుడిసె, స్కూటర్ ధ్వంసం



ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన మామిడి తోటలు

ఐరాల, జూన్ 2 ప్రభాతవార్త: మండలంలోని పలు గ్రామాలలో ఏనుగుల గుంపు చేస్తున్న దాడులు కొనసాగుతున్నాయి. వరుసగా పంట పొలాలపై దాడులు చేసి రైతు సాగు చేస్తున్న పలు రకాల పంటను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలో గత నెల 26న పొలకల ఎల్లంపల్లె గ్రామ సమీపంలోని పంటలపై దాడులు చేసి సుమారు ఐదు లక్షల రూపాయల విలువగల పంటలను ధ్వంసం చేశాయి. అలాగే బుధవారం రాత్రి మండలంలోని గూబలవారిపల్లె పరిసరాల్లో ఏనుగుల గుంపు దాడులు చేసి పంటను ధ్వంసం చేశాయి. అలాగే గురువారం రాత్రి గూబలవారి పల్లె గ్రామ సమీపంలోని చుక్కావారిపల్లె గ్రామ సమీపంలోని పంట పొలాలపై దాడులు చేసి పంటలను ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు చుక్కావారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి మామిడి పంటను ధ్వంసం చేశాయి. అలాగే మామిడి తోటలో వున్న గుడిసెను కూడా ఏనుగులు పీకి ధ్వంసం చేశాయి. అలాగే బాలాజి అనే మామిడి వ్యాపారి మామిడితోటలో వుంచిన ద్విచక్రవాహనాన్ని ఏనుగులు మామిడి తోట నుండి బయటకు విసిరి పడేశాయి. దీనితో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. ఇదిలా వుండగా తరచూ ఐరాల మండలంలోని పలు గ్రామాల రైతుల పంట పొలాలపై ఏనుగుల దాడులు చేసి పంటలకు నష్టం కలిగిస్తుడడంతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన ద్విచక్రవాహనం

# సకాలంలో నిర్ధేశించిన లక్ష్యాలు పూర్తి: కలెక్టర్

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:
వ్యవసాయ, అనుబంధ శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం వ్యవసాయ, అనుబంధ శాఖలైన మత్స్య, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, ఎపిఎంఐపి, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టు శాఖకు సంబంధించి ఈ ఏడాది 3 వేల ఎకరాల విస్తీర్ణంలో పెంచడానికి చర్యలు తీసుకొంటామని పట్టు పరిశ్రమల శాఖ అధికారిణి శోభారాణి పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ,



అనుబంధ శాఖల అధికారులు జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులకు నిర్ధేశించిన లక్ష్యాల వివరాల జాబితాను సత్వరం అందించాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు మండల స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించి వ్యవసాయ, అనుబంధ శాఖలకు నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో పూర్తి చేయడానికి నడుంబిగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, పట్టు పరిశ్రమలశాఖ డిడి శోభారాణి, పశుసంవర్ధకశాఖ జెడి ప్రభాకర్, మత్స్యశాఖ డిడి రవికుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వాలంటీర్ మృతి

చౌడేపల్లి, జూన్ 2 ప్రభాతవార్త :



స్కూటర్ అదుపుతప్పి కిందకు పడ్డ వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో గురువారం రాత్రి చౌడేపల్లి వైపు వస్తున్న స్కూటర్ అంబేద్కర్ భవనానికి సమీపంలో అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో సోమల మండలం నెల్లిమంద యానాదివాడ ధర్మతేజ(37)తలకు బలమైన గాయమైంది. గాయపడ్డ అతన్ని చుట్టుపక్కల వారు 108సేవల ద్వారా మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి, అటు నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ధర్మతేజ మృతి చెందాడు.

## లోకమాతకు రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 2 ప్రభాతవార్త :



లోకమాత గంగమ్మకు శుక్రవారం రాహు కాలాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. దంపతులు, కుటుంబ సభ్యులతో అమ్మవారికి రాహుకాలాభిషేకం చేయడం వల్ల సుఖ శాంతులతో వుంటారని పండితులు తెలిపారు. అంతేకాకుండా లోకం సుభిక్షంగావుంటుందని భక్తుల విశ్వాసం. దీంతో రాహుకాలాభిషేకానికి విశేష స్పందన లభిస్తోంది. రాహుకాల సమయంలో గంగమ్మకు పసుపు, కుంకుమ, నీరు వంటి జలాలు, నారికేళాభిషేకం నిర్వహించారు.

## నేడు ఊంజల్ సేవ

**శ్రీకాళహస్తి,జూన్ 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పౌర్ణమి సందర్భంగా ఊంజల్ సేవ నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇఓ కెవి సాగర్‌బాబు శుక్రవారం తెలిపారు. శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రతి నెల కోట మండపంలో నిర్వహించే 'ఊంజల్‌సేవను'అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించారు. శనివారం రాత్రి కోట మండపం వద్ద ఊంజల్ సేవను ఏర్పాటు చేసామన్నారు. భక్తులు విశేష సంఖ్యలు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని ఇఓ కోరారు.

## నేడు శాంతిపురం మండల తెదేపా సమావేశం

శాంతిపురం, జూన్ 2 ప్రభాతవార్త :
శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, కార్యదర్శి నాగరాజు తెలిపారు. సమావేశానికి తెదేపా నేతలు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

## సంక్షేమ రథసారథి సిఎం జగనన్న

**- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమ రథసారథి సిఎం జగనన్న అని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పం మండలం బందార్లపల్లి పంచాయతీ కొటారు గడ్డ, బోయనపల్లి, గెర్నిపల్లి గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమంను చేపట్టారు. పేదలకు వైకాపా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కలిగిన లబ్ధిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచులు రాజగోపాల్, బివి మురళీకృష్ణ, నేతలు ఆరేళ్ల జయప్ప తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ట్రాక్టర్ బోల్తాపడి మాజీ సైనికుడు మృతి!

ఐరాల, జూన్ 2 ప్రభాతవార్త:



మండలంలోని వేదగిరివారిపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్ బోల్తాపడిని సంఘటనలో మాజీ సైనికుడు అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలావున్నాయి. వేదగిరివారిపల్లెకు చెందిన చెంగల్రాయనాయుడు కుమారుడు గోపీనాద్(32) అనే మాజీ సైనికుడు తన వ్యవసాయ పొలంలోని కోళ్ళషెడ్డు వద్దకు ట్రాక్టర్‌లో బయలు దేరాడు. కోళ్ళషెడ్డు సమీపంలో ప్రమాదశాత్తు ట్రాక్టర్ బోల్తాపడడంతో గోపినాథ్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఘనంగా శ్రీ వరదరాజస్వామి గరుడసేవ



కుప్పంరూరల్, జూన్ 2 ప్రభాతవార్త
కుప్పం మున్సిపల్ లక్ష్మీపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఈనెల 12వతేది వరకు ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో బెంగళూరు, చెన్నైలకు చెందిన బ్రాహ్మణ వంశస్తులు, శ్రీధర్‌స్వామి, లక్ష్మీపురం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త :



మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కుప్పంలో సిఐటియు అధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ దేశానికి బంగారుపతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు గత ఆర్నెల్లుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు ప్రమీళ, లలిత, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ప్రాణ..మానవ నష్టాలకు అధికారులదే బాధ్యత

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త :



వేతనాల కోసం ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు చేపట్టిన సమ్మె 36 రోజులు పూర్తి చేసుకుంది. నాలుగు నెలలుగా తమకు వేతనాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని వాపోయారు. పరిస్థితి ఇలాగే ఉంటే తమ ప్రాణ, మానవ నష్టాలకు వర్సిటీ అధికారులదే బాధ్యత అని పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర గవర్నర్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, కుప్పం జడ్జి, గుడుపల్లె, కుప్పం తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. 11వ పిఆర్‌పి ప్రకారం నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని, పన్నెండు నెలల అరియర్లు, సిఎఫ్‌ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

# రెగ్యులర్ టీచర్ నియమించాలని...

**-అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన గ్రామస్థులు**

ఐరాల, జూన్ 2 ప్రభాతవార్త:
అంగన్‌వాడీ కేంద్రానికి రెగ్యులర్ టీచర్ నియమించాలని, కేంద్రానికి పక్కాభవనం నిర్మించాలని అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని చెంగనపల్లె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. చెంగనపల్లె గ్రామం అంగన్‌వాడీ కేంద్రానికి రెగ్యులర్ టీచర్ పోస్టు ఖాళీగా వుంది. దీనితో టీచర్‌పోస్టును భర్తీ చేయాలని గ్రామస్థులు పలు మార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనితో ఇన్‌చార్జి టీచర్లును నియమించడం తప్ప రెగ్యులర్ టీచర్‌ను నియమించకపోవడంతో



స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు,మహిళలు శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి రెగ్యులర్ టీచర్ లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. ప్రయివేటు పాఠశాలల్లో పిల్లలను నర్సరీలో చేర్పించాలంటే వేల రూపాయల వరకు ఫీజులు డిమాండు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి రెగ్యులర్ టీచర్‌ను నియమించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 28 ఏళ్ల తర్వాత కలిసిన మిత్ర బృందం



కోట, జూన్ 2 ప్రభాతవార్త :
కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ మోడల్ హైస్కూల్లో 1994-95లో 10వ తరగతి విద్యార్థులు శుక్రవారం హిల్ హ్యూ రెస్టారెంట్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జీవితంలో స్నేహితుల పాత్ర ఎంతో కీలకమని, ఆటపాటలు, చిల్లర పనులు, కష్టసుఖాలు... ఇలా ఏదైనా అన్నింటిలోనూ మన వెంట ఉండేది ఒక్క స్నేహితుడేనని పలువురు అన్నారు. జీవితంలో చెరగని ముద్ర వేసుకునేది 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు మాత్రమే అని, వారితో ఉన్న జ్ఞాపకాలు ఎన్నటికీ మరచిపోలేనివని చెప్పుకొచ్చారు. ఒకరినొకరు సెల్ఫీలు తీసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమ విద్యాభివృద్ధికి కారకులైన పద్మశ్రీ దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

## ముటేషన్లను సకాలంలో పరిష్కరించాలి

కోట, జూన్ 2 ప్రభాతవార్త :
ముటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా గడువులోగా పరిష్కారం చూపేలా దృష్టిపెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ నుంచి తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విలేజి సర్వేయర్లు డేటాఎంట్రీ, జగనన్నకు చెబుదాం, ముటేషన్, అసైన్‌మెంట్ ల్యాండ్స్ తదితర అంశాలపై నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత అంశం కాబట్టి అర్జీలను సంతృప్తిస్థాయిలో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ముటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో విలేజి సర్వేలో డేటాఎంట్రీ ప్రక్రియ త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

సూళ్లూరుపేట, జూన్ 2 ప్రభాతవార్త :



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. విఎస్‌ఎస్‌సి డిగ్రీ కళాశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన, ఫెయిలైన వారితో పాటు ఇంటర్, డిప్లొమా, డిగ్రీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామోహన్, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్ పాల్గొనగా, జాబ్‌మేళాకు సంబంధించి 16 బహుళ జాతి కంపెనీలలో సుమారు వెయ్యి మంది నిరుద్యోగులకు అవకాశం కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 9966601867 నంబరుకు సంప్రదించాలని కోరారు.

# పేద ప్రజలను మోసం చేసిన ఎంఎల్ఏ ఆనం

**-వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి**

వెంకటగిరి, జూన్2 ప్రభాతవార్త :
నియోజవర్గంలో అనేక మందికి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డి పేదప్రజలను మోసం చేసినట్లు వైసిపి నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన పట్టణంలోని బిసి కాలని మూడవ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బగ ఆయన మాట్లాడుతూ అర్హులయిన పేదలకు ఇంటి స్థలాలు, ఫించన్లు ఇచ్చి మరలా వెనక్కు ఎంఎల్ఏ ఆనం తీయించి వేసినట్లు స్థానికులు వాపోతున్నట్లు



తెలిపారు. ఎంఎల్ఏ ఆనం హయాంలో అనేక మోసాలు, అన్యాయాలు జరిగినట్లు తెలిపారు. ఆయన వెంట కమీషనర్ వెంకట్రామయ్య, పట్టణ కన్వినర్ జి డిల్లిబాబు, వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నాయకులు లక్కమనేని కోటేశ్వరరావు, మురళీకృష్ణ, కౌన్సిలర్స్ మాడ జానకీరామయ్య, ఎంఎ నారాయణ, సుబ్బరావు, తదితరులు పాల్గోన్నారు.

## జగనన్న విద్యాకానుక స్టాక్‌పాయింట్ తనిఖీ

నాయుడుపేట, జూన్ 2 ప్రభాతవార్త :
నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఆర్డీఓ చంద్రముని తనిఖీ చేశారు. తహశీల్దార్ రాజేంద్ర, ఎంపిడిఓ శివప్రసాద్ తదితరులు విద్యాకానుక వివరాలను ఆర్డీఓకు తెలియజేశారు. జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించిన ఆర్డీఓ చంద్రముని సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు

దొరవారిసత్రం, జూన్ 2 ప్రభాతవార్త :
వారంరోజుల నుంచి ఎండలు తీవ్రరూపం దాల్చడం, దానికితోడు ఉక్కపోత అధికంగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని గ్రామాల్లో పిల్లలు, వృద్ధులు ఈ ఎండలకు సతమతం అవుతూ వడదెబ్బకు గురవుతున్నారు. దీనికితోడు గాలి కూడా వీయకపోవడంతో చమటలతో ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు అవస్థలకు గురవుతున్నారు. ఎండలు బాబోయ్ అంటూ ఇంట్లో నుంచి బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఇక గ్రామాల్లోని ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం.

## మహిళా కానిస్టేబుల్‌ను సత్కరించిన ఎంఎల్ఏ



వరదయ్యపాళెం,జూన్ 2 ప్రభాతవార్త :
విధి నిర్వహణలో జవాబుదారి తనంతోనూ, మానవత్వంతో వ్యవహరించిన వరదయ్యపాళెం సచివాలయంలో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ జ్ఞాన ప్రసూనాంబను శుక్రవారం సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం అభినందించారు. ఈ మేరకు సచివాలయంలో ఆమెను ఎంఎల్ఏ దుశ్శాలువతో సత్కరించారు. వరదయ్యపాళెం పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా కానిస్టేబుల్‌ను సత్కరించారు. ఆమెధన్యవాదాలు తెలిపారు.

## బాలలను పనిలో చేర్చుకుంటే కఠిన శిక్షలు తప్పవు

శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త :




బాలకార్మికులను పనిలో చేర్చుకున్న దుకాణదారులు యజమానులకు కఠిన శిక్ష తప్పదని తిరుపతి జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. బాలకార్మిక చట్టం అమలు పరచేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కార్మికశాఖ అధికారులు మరియు పారాలీగల్ వాలంటీర్లు తెలిపారు. బాలకార్మిక నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా సీనియల్ సివిల్‌జడ్జి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నుంచి సూపర్‌బజారు కూడలి వరకు ఉన్న అన్ని దుకాణాల్లో కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేసి బాలకార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## టపాయాల గోదాములను పరిశీలించిన పోలీసులు:

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), జూన్ 2 ప్రభాతవార్త :



జిల్లాలోని తూర్పు మండలాల్లోని వరదయ్యపాళెం సమీపంలోని ఎల్లకట్టవ గ్రామంలో అనధికారిక టపాకాయల తయారి కేంద్రంలో జరిగిన దుర్ఘటనతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏర్పేడుమండలంలో సిఐ శ్రీహరి వారి సిబ్బంది పలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని పల్లం పేటలోని టపాసుల గోదామును ఆకస్మికంగా తనికీ చేసారు. అక్కడ ఎలాంటి స్టాకుల్లేదని గుర్తించారు. లైసెన్సులు నిలిచి పోయాయని వివరించారు. వెంటనే లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైన నాటు నల్లమందు తయారి కేంద్రాలుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సిఐతో పాటు విఆర్‌ఓ రవి పాల్గొన్నారు.

# సహకార సంఘాల ఉద్యోగులకు బదిలీలు

**- ప్రక్షాళన దిశగా ప్రభుత్వం**

కోట, జూన్ 2 ప్రభాతవార్త :
సహకార శాఖను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా కేంద్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశ వ్యాప్తంగా సహకార సంఘాల పనితీరు ఒకేలా ఉండాలన్న ఉద్దేశంతో కొత్త సంస్కరణలు అమల్లోకి తెస్తోంది. అందులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అన్నింటినీ (పిఎసిఎస్) డిజిటలైజేషన్ చేయడం, ఉద్యోగులకు జీతాలు పెంచి బదిలీలు చేయడం, సంఘాల లావాదేవీలపై అదనపు ఆడిట్లు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెలాఖరులోగా అన్నీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే తమ సమస్యలను పరిష్కరించాకే బదిలీల ఆలోచన చేయాలని సహకార ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 300 మంది వరకు పనిచేస్తున్నారు. వీరంతా అరకొరా జీతాలతో ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వీరికి హెచ్ఆర్ పాలసీ అమలు చేసి జీతాలు పెంచడంతో పాటు తొలిసారి బదిలీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం జీవో నంబర్ 36 తీసుకొచ్చింది. ఉద్యోగుల జీతభత్యాలు, బదిలీల వ్యవహారంపై జిల్లా స్థాయిలో ఎంపవర్‌మెంట్ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. డిసిసిబి ఛైర్మన్‌తో పాటు సిఇఓ, డిసిఓ త్రిమెన్ కమిటీగా ఉద్యోగ సంఘాలు సమావేశమై చర్చించి ఏకాభిప్రాయంతో ముందుకెళ్లాలి. జిల్లాలో ఇప్పటివరకు ఆ దిశగా కమిటీ చర్యలు తీసుకోలేదని సహకార ఉద్యోగులు చెప్తున్నారు. పాత జీవోనంబర్ 51 ప్రకారం 2014 నుంచి కొత్త జీతాలు అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లింపులకు స్పష్టమైన హామీలు వచ్చిన తర్వాతే బదిలీలు చేయాలని కోరుతున్నారు. ప్రాథమిక సహకార సంఘాలు ఇప్పటివరకు మాన్యువల్‌గానే దస్త్రాలు నిర్వహిస్తున్నారు. రైతుల రుణాలు మంజూరు నుంచి రికవరీల వరకు అన్నీ సర్దుబాటుతోనే సరిపెట్టేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై సహకార సంఘాల లావాదేవీలన్నీ డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే పిఎసిఎస్‌కు కంప్యూటర్ సెంటర్, సిబ్బందిని అందజేస్తున్నారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, సిఇఓ కన్వీనర్‌గా, డిసిఓ, నాబార్డు డిడిఎం, ఆప్కాబ్ సంఘాల నుంచి ముగ్గురిని సభ్యులుగా జిల్లాస్థాయి పర్యవేక్షణ అమలు కమిటీగా నియమించి సంఘాలను పర్యవేక్షించనున్నారు.

## కష్టార్జితంలో అభివృద్ధి ఉంటుంది : రేహాన్

శ్రీకాళహస్తి,జూన్ 2 ప్రభాతవార్త :



మానవుడు సంపాదించే సంపదలో కష్టార్జితమైతే ఒదుగు ఉంటుందని అభివృద్ధి ఉంటుందని,సంతృప్తి ఉంటుందని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా హాజరైన వేలాది మందిని ఉద్దేశించి రేహాన్ దిశ దెశ నిర్దేశం చేస్తూ దివ్యఖుర్ ఆదేశాలను, అలాగే మన ప్రవక్తలు ఆచరించిన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో 'అల్ప సంపాదన మీదనే దృష్టి సారిస్తున్నారు.' వడ్డీలకు ఇవ్వటం, ఆన్‌లైన్‌లో జూదమాడటం,ఇటీవల క్రికెట్ పేరుతో సాగిన,సాగుతున్న అక్రమ సంపాదన దారులు సరైనవి కాదన్నారు.మనిషి ధర్మబద్ధంగా తాను కష్టపడి సంపాదించే ప్రతి పైసా రూపాయిగా వృద్ధి చెందుతుందన్నారు. అక్రమ సంపాదన రాత్రికా రాత్రి కోటీశ్వరులు కావాలనే యోచన చివరకు నష్టాలు, కష్టాలు మిగుల్చుతుందని ఉదాహరణలతో వివరించారు.కష్టార్జితంలో కుటుంబంలో శాంతి,సౌఖ్యాలుంటాయని వివరించారు. కష్టపడి కష్టజీవి తన కుటుంబంతో ఎంతో సంతోషంగా గడుపుతుంటాడని అయితే లక్షలకు లక్షలు నెలకు సంపాదించే కుటుంబాల్లో కష్టాలు,నష్టాలు,ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు.మనిషి ఎప్పుడూ కష్టార్జితానే నమ్ముకోవాలని రేహాన్ సూచించారు.

## మద్యం బాటిళ్ళు స్వాధీనం...అదుపులో ఒకరు

తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త :



మండలంలోని పూడి గ్రామ మలుపు వద్ద పెళ్ళకూరు మండలం కలవకూరు గ్రామానికి చెందిన రామయ్య(60) వద్ద మద్యం తరలిస్తుండగా గుర్తించిన పోలీసు సిబ్బంది అతని వద్ద నుంచి 13మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. రామయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నా తమకు వెంటనే తెలియజేయాలని, ముఖ్యంగా గ్రామాల్లో కూల్‌డ్రింగ్‌షాపుల్లో మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు.

## రూపేష్ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం

తొట్టంబేడు, మే 2 ప్రభాతవార్త :



మండలంలోని పొయ్య పంచాయతీ గురుకులపాళెం హరిజనవాడకు చెందిన కట్టా శ్రీరాములు, సక్కమ్మల కుమారుడు రూపేష్ గత కొద్ది రోజుల క్రితం పెద్దసింగమాల వద్ద ఉన్న తెలుగుగంగ కాలువలో ఈతకు వెళ్ళి గల్లంతయిన విషయం విదితమే. ఈనేపథ్యంలో మండల ఎంపిపి ఉన్నంనిర్మలవాసుదేవనాయుడు, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు దంపతులు రూపేష్ కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించారు. ఈసందర్భంగా వైకాపా నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ రూపేష్ కుటుంబానికి తాము అండగా ఉంటామని వారిని ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు తుమ్మురుమోహన్, కన్నలి లీలా ప్రసాద్, క్రాంతికుమార్, చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేణుకామాత ఆలయంలో గోపూజ కార్యక్రమం

తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త :



మండలంలోని శేషమనాయుడుకండ్రిగ అరుంధతీవాడలో రేణుకామాత పరమేశ్వరి ఆలయంలో ఎంఎల్ఏ తనయ బియ్యపుపవిత్రారెడ్డి విచ్చేసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని గోపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ గోవులు సకలదేవతల నిలయం అని గోపూజతో సర్వపాపహరణాలు తొలగిపోతా యన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ జగనన్న పథకాలు అర్హులైన వారందరికీ అందుతున్నాయా?లేదా తెలుసుకున్నారు. ఎవరికి ఏసమస్య ఉన్నా మన ఎంఎల్ఏ బియ్యపువ ఎధుసూధన్‌రెడ్డి ఎల్లవేళ్ళలా అందుబాటులో ఉంటారని తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ లక్ష్మి, ఎంపిటిసి గురుస్వామినాయుడు, దీపక్‌రెడ్డి, నరసింహనాయుడు, కొన్నలి రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగమణి, వెంగళరావు, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో చిన్నారులకు వివిధ పోటీలు

శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త :



పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జూడో, ఖోఖో, హాకీ, టెబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్‌ల శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర శాఫ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేసుకుని ఇందులో పాల్గొన్న క్రీడాకారులు మరియు బాలుర ఉన్నత పాఠశాల సిబ్బంది జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులుకు శాఫ్ ఆధ్వర్యంలో పతకాలు, సర్టిఫికెట్లు ఇచ్చి అభినందించారు. వినాయక ఛారిటబుల్ ట్రస్టు టి.సురేంద్రకుమార్ క్రీడాదుస్తులు పంపిణీచేశారు. నెలరోజుల పాటు విశ్రాంత హెచ్ఎం వాసుదేవరావు చిన్నారులకు అల్పాహారం అందించారు. క్రీడల వల్ల శారీరక వికాసం, మానసిక వికాసం, ఉద్యోగావ శాకాల్లో ప్రాధాన్యత ఉంటుందనానరు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హెచ్ఎం రాజేశ్వరి, న్యాయవాది మునిశేఖర్, శివకుమార్, మధు, పిడి వెంకటముని, యుగంధర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డికండ్రిగలో ప్రబలుతున్న విష జ్వరాలు

విజయపురం, జూన్ 2 ప్రభాతవార్త :



మండలంలోని మల్లారెడ్డికండ్రిగలో విష జ్వరాలతో గ్రామస్తులు అస్వస్థతకు లోనవుతున్నారు. గ్రామంలో 80 కుటుంబాలు వుంటే 40 కుటుంబాలు జ్వరంతో బాధపడుతుండడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో తిరుత్తణి, కనకమ్మసత్రం, తిరువళ్లూరు ఆస్పత్రులకు వెళుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించినా జ్వరాలు తగ్గుముఖం పట్టలేదు. ఎండ తీవ్రత వల్ల జ్వరాల బారిన పడుతున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. మల్లారెడ్డికండ్రిగలో అయిదు ఆవాస ప్రాంతాలుంటే ఒక్క మల్లారెడ్డికండ్రిగలో మాత్రమే జ్వరాలు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. మంచినీటి కలుషితం, అపారిశుధ్యం వంటి ఏ కారణం వల్ల జ్వరాలు ప్రబలుతున్నాయో పరిశీలించి వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సిపిఎస్ రద్దు .. ఓపిఎస్ పునరుద్ధణ

చంద్రగిరి, జూన్ 2 ప్రభాతవార్త:



సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపిజిఈఏ (ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ యంప్లాయిస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు పలు డిమాండ్లతో రిలే నిరాహాదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపిజిఈఏ అధ్యక్షుడు మాధవరావు, సెక్రటరీ మహేశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తారీఖునే వేతనాలు చెల్లించే విధంగా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్, డైలీవేజెస్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. వివిధ శాఖలలో డిఎస్సీ ఆ్వరా నియమితులైన ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఒప్పంద కార్మికులకు మెరుగైన వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, జిల్లా సెక్రటరీ సుబ్బరాయుడు, తాలూకా జాయింట్ సెక్రటరీ రవిశంకర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ జయ, వినోద్, పెన్షనర్ల సంఘం, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ సంఘం, సిపిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానం

చంద్రగిరి, జూన్ 2 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు కాపువీధి సోదరులు కాపువీధి తులసీరామ్, కాపువీధి సునీల్ అన్నదానం చేశారు. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారి భక్తులకు అన్నదానం చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆకలి తీర్చడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. అంతకు ముందు ఆలయ పాలక మండలి సభ్యుడు శమరపాకు వేమారెడ్డి సారెను స్వీకరించి అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రతి యజమానిని లక్ష్యాధికారి చేయడమే ప్రభుత్వ లక్ష్యం..!

-వైసిపి నెత్తకుప్ప ం డిజవినల్ కన్వీనర్ తాతిరెడ్డి వెంకట రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 2 ప్రభాతవార్త:



ప్రతి కుటుంబ యజమానిని లక్ష్యాధికారి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి నెత్తకుప్ప ం డిజవినల్ కన్వీనర్ తాతిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. శుక్రవారం నెత్తకుప్పం వారపు సంతలో ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించేందుకు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, పంచాయతీ కన్వీనర్ సాయిశశికాంత్, నాయకులు శ్రీనివాసులు యాదవ్, ఆంజనేయులు, రేపల్లి ప్రసాద్, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## రోలర్ స్కీ పోటీలలో మెరిసిన సచివాలయం ఉద్యోగి

తిరుపతి (క్రీడా), జూన్ 2 ప్రభాతవార్త :



తిరుపతిలో జరిగిన రోలర్ స్కి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని 1.1 కిలోమీటర్లు, 1.3 కిలోమీటర్ల పోటీల్లో రెండు కంశ్య పథకాలు సాధించి సత్తా చాటిన తిరుపతి సచివాలయంలో ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ విధులు నిర్వహిస్తున్న బి. కార్తిక్ రెడ్డిని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత సన్మానించారు. తిరుపతి సచివాలయం ఉద్యోగస్తులు అభినందించారు.

## గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం

తిరుపతి (విద్య), జూన్ 2 ప్రభాతవార్త :



తిరుపతి అన్నయ్య సర్కిల్ ఆల్ ఇండియా రేడియో వెనకాల వున్న ప్రభుత్వ గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయం తిరుపతి నందు ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఉయ్ సపోర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు తహసు న్నిసా బేగం విద్యార్థిని, విద్యార్థులకు యోగా నందు ఉచితముగా శిక్షణ ఇవ్వడమైనది. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు యోగా, ధ్యానం అలవర్చుకోవాలన్నారు. శాఖా గ్రంథలయం తిరుపతి నందు ఈ ఉచిత యోగా శిక్షణ తరగతులు ఈ నెల 10వ తేది వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జె. శివప్రసాద్, జీవన్, మునీంద్ర, గోవింద, హైస్కూల్ విద్యర్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టిటిడి నిర్దేశించిన సమయం ప్రకారం బస్సులు నడపాలి

-డిపో మేనేజర్లకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఆదేశం

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 2 ప్రభాతవార్త:



తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్ నందు టిటిడి వారు నిర్దేశించిన సమయం ప్రకారమే డ్రైవర్లు బస్సులను నడిపేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి ఆయా ఘాట్ డిపో మేనేజర్లను ఆదేశించారు.గత కొన్ని రోజులుగా ఘాట్ రోడ్ నందు జరుగుతున్న వరుస ప్రమాదాల నేపథ్యం లో శుక్రవారం స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం నందు బస్సులను సురక్షితంగా నడుపుటకు తీసుకోవలసిన జాగ్రత్తలపై జిల్లాలోని సీనియర్ స్కేల్ ఆఫీసర్లు,వివిధ ఘాట్ డిపో మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఘాట్ రోడ్డు నందు డ్రైవర్లు బస్సులను సురక్షితంగా నడపడానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. తిరుమలకు నడుపు బస్సులను ప్రత్యేకంగా తనిఖీ చేయవలసిందిగా,అలాగే బస్సుల కండిషన్ అత్యంత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్లు,డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌ను డిపిటిఓ ఆదేశించారు.ఈ ఏడాది తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు రెండు పర్యాయాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఇప్పటి నుండే సన్నద్ధం కావాలని ఆర్టీసీ అధికారులందరికీ దిశ నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నరసింహులు,డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్,బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, తిరుపతి, తిరుమల,అలిపిరి డిపో మేనేజర్లు బాలాజి,విశ్వనాథ్,భాస్కర్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్స్: 2 పిసి 01 / అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డిపిటిఓ చెంగల్‌రెడ్డి..

## పాతార్కాడులో యధేచ్ఛగా చెరువు మట్టి తరలింపు

విజయపురం, జూన్ 2 ప్రభాతవార్త :

మండలంలోని పాతార్కాడు చెరువులో యదేచ్ఛగా చెరువు మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో మట్టి తవ్వుతుండడం వల్ల చెరువు కట్టకు ఆనుకుని వున్న పొలాల్లో నేల గుల్లబారిపోతుందని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## అనధికారికంగా టపాసుల షాపులపై చర్యలు తప్పవు :

విజయపురం, జూన్ 2 ప్రభాతవార్త :

అనధికారికంగా టపాసుల షాపులు నిర్వహించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని నగరి రూరల్ సిఐ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మహారాజపురంలో టపాసుల దుకాణాన్ని పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా టపాసుల తయారీ జరగాలని, జనసందడి వున్న ప్రదేశాల్లో నిల్వ వుంచడం చేయకూడదన్నారు. అనంతరం పన్నూరు సబ్‌స్టేషన్‌లోని షాపులను పరిశీలించారు. ఆయనతో పాటు ఎఎస్ఐ లోకనాథం తదితర సిబ్బంది వున్నారు.

# తిరుపతి డివిజన్

## తొలిరోజు వజ్రకవచంలో మెరిసిన మలయప్ప

-వేడుకగా జ్యేష్టాభిషేకాలు ఆరంభం

తిరుమల,జూన్ 2 ప్రభాతవార్తప్రతినిధి:



జ్యేష్టమాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసే విధంగా ఏడుకొండలవాడి ఆలయంలో మూడురోజులు జరిగే జ్యేష్టాభిషేకాల్లో తొలిరోజు శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం అనంతరం శ్రీదేవిభూదేవి మలయప్పస్వామి ఉత్సవర్లు వజ్రకవచంలో మెరిశారు. ఆలయంలోపల సంపంగిప్రాకారంలో జరిగిన ఈ ఉత్సవంలో పంచామృత స్నపన అభిషేకాలు నిర్వహించి నేవిదనలు సమర్పించారు. ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం రద్దయ్యాయి. తొలిరోజు కార్యక్రమాల్లో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, టిటిడి ఛైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి ,గృహస్థభక్తులు పాల్గొన్నారు.

## రేపు డయల్ యువర్ ఇఒ

తిరుమల,జూన్ 2 ప్రభాతవార్తప్రతినిధి:



భక్తులు స్వామివారి దర్శనం, వసతి, లడ్డూప్రసాదాలు తదితర వాటిపై కలిగిన అనుభవాలు, మెరుగుపరచాల్సిన అంశంపై సూచనలు చేసేందుకు నిర్వహించే "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం 4వతేదీ ఆదివారం ఉదయం జరగనుంది. ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు తిరుమల అన్నమయ్యభవనంలో జరగనున్న ఈ కార్యక్రమానికి భక్తులు 0877-2263261 నంబర్‌కు కాల్‌చేసి ఇఒ ధర్మారెడ్డితో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

## గంగమ్మ చల్లగా చూడు

తిరుపతి,జూన్ 2ప్రభాతవార్త:

తాతయ్యగుంట గంగమ్మను మూడవశుక్రవారం రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కుటుంబం దర్శించుకున్నారు. జాతర తరువాత శుక్రవారం అమ్మవారికి పూజలు చేశారు.

## అధికారులను కలసిన...టిటిడి ఉద్యోగుల బిసి సంక్షేమసంఘం

తిరుమల,జూన్ 2 ప్రభాతవార్తప్రతినిధి:



టిటిడిలో నూతనంగా ఏర్పాటైన బిసి ఉద్యోగుల సంక్షేమసంఘం కార్యవర్గం శుక్రవారం టిటిడి అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. గౌరవ సలహాదారుడు శైలేంద్రకుమార్, అధ్యక్షుడు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌యాదవ్, కోశాధికారి కామరాజు, అదనపు ప్రధాన కార్యదర్శి దేశయ్య, వర్కింగ్ అధ్యక్షుడు యువరాజు, ఉపాధ్యక్షురాలు అనురాధ ,సంయుక్తకార్యదర్శి అరుణ్‌కుమార్, రామారావు, హేమ్‌కుమార్, లావణ్య,కళావతిలు జెఇఒ వీరబ్రహ్మం, లా ఆఫీసర్ జస్టిస్ వీర్రాజు, బోర్డుసెల్ డిప్యూటీ ఇఒ కస్తూరిబాయి, అడిషనల్ సివిఎస్ఒ శివకుమార్‌రెడ్డి ,మాధవి, తదితరులను కలిసి సన్మానించారు.

## తడ పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు కానిస్టేబుళ్లు బదిలీ

తడ, జూన్ 2 ప్రభాతవార్త :

సాధారణ బదిలీలలో భాగంగా తడ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లను తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. శుక్రవారం వచ్చిన ఆదేశాల మేరకు పార్థసారథి, గిరీష్, రామమోహన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులుతో పాటు కవిత అనే మహిళా కానిస్టేబుల్‌ను కూడా ఇక్కడి నుంచి బదిలీ చేశారు. పోస్టింగ్ పడిన చోట ఆయా పీసీలు రిపోర్టు చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈమధ్యకాలంలో ఒకేసారి ఇంతమంది కానిస్టేబుళ్లను తడ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీ చేయడం విశేషం.

## అమ్మ.. నాన్న ఎక్కడ ?



జవాబు చెప్పలేని తల్లి- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

రేణిగుంట, జూన్ 2 ప్రభాతవార్త :

అమ్మ.. నాన్న ఎక్కడ.. ఇంకా రాలేదు అంటూ చిన్న పిల్లలు తల్లిని అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియక ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. క్షణికావేశంలో ప్రాణం తీసుకుని భార్యకు, తన కుమారులకు పుట్టెడు దు:ఖాన్ని మిగిల్చి ఆత్మహత్య చేసుకుని కానరాని లోకాలకు వెళ్లి పోయాడు.. శ్రావణ్.. రేణిగుంట బుగ్గ వీధిలో కాపురం ఉంటున్న శర్వణ కుమార్ అలియాస్ శ్రావణ్ (35) తూకివాకం చెరువు వద్ద క్రిమిసంహారకమందు సేవించి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం తెలిసింది. పోలీసుల కథనం మేరకు ఏర్పేడు మండలం జింకలమిట్ట గ్రామానికి చెందిన శర్వణ కుమార్‌కు సుమారు పది సంవత్సరాల క్రితం నాగేశ్వరితో వివాహమైంది. రేణిగుంట పోస్ట్ ఆఫీస్ వీధిలో అతను సెల్ఫోన్ షాప్ నిర్వహిస్తున్నాడు. అందరితో బాగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరించేవాడు. భార్య నాగేశ్వరి సిఆర్ఎస్‌లో టెక్నిషియన్‌గా విధులకు వెళ్తోంది. వీరికి ఇరువురు కుమారులు ఉన్నారు. గత కొద్ది నెలల క్రితం మొబైల్ షాప్‌ను నిర్వహించడం ఆపేశాడు. అప్పటి నుండి ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి సినిమాకి వెళ్తున్నానని భార్యతో చెప్పి బయటుదేరి వెళ్లారు. రాత్రి అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం ఉదయం అతను తూకివాకం చెరువు వద్ద ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు తెలిసిన వారి నుండి ఫోన్ కాల్ వచ్చింది. సమాచారం గాజులమండ్యం పోలీసులకు తెలియడంతో హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకున్నారు. మృతదేహం వద్ద మద్యం బాటిల్, క్రిమిసంహారక మందు సీసా (మోనోక్రాస్) పడి ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు

రేణిగుంట, జూన్ 2 ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి రేణిగుంట విమానాశ్రమంలో సాదర వీడ్కోలు లభించింది. శ్రీవారి దర్శనానంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ డికే బాలాజీ, మున్సిపల్ కమిషనర్ హరిత, రేణిగుంట డిఎస్పి భవ్యకిషోర్, తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఎక్సప్రెస్ రైల్ మేనేజర్ పదవీ విరమణ

తిరుపతి కార్పొరేషన్, జూన్ 2 ప్రభాతవార్త :



ఆర్‌ఆర్‌బి పోటీ పరీక్షలు ఎంవి రమణ ఉత్తీర్ణులై 1989 రేణిగుంటలో నిలయంగా గార్డుగా పనిచేస్తూ ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘంలో చేరి ఉద్యోగులకు చేదోడు వాదోడుగా అనేక మందికి సేవలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ ఉద్యోగులను ప్రోత్సహించే అవార్డులో డిఆర్ఎం అవార్డు, సేఫ్టీ అవార్డులను ఉన్నత అధికారులు చేతుల మీదుగా అందుకున్నారు. ఎంవి రమణ కొడుకు కెనడాలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాధ్యతతో ఒక క్రమశిక్షణగా విధులను నిర్వహిస్తున్నందుకు పలువురు అధికారులు అభినందించారు. పదవి విరమణ సందర్భంగా ఎంవి రమణ మాట్లాడుతూ రైల్వే శాఖతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకుని జ్ఞాపకాలను తెలియజేసారు. ఎం.వి రమణ, ఎక్స్‌ప్రెస్ రైలు మేనేజర్ పదవి విరమణ సందర్భంగా తిరుపతి రైల్వే స్టేషన్‌లో విఐపి లాంచ్‌లో పదవి విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పల సత్యనారాయణ, ప్రభాకర్, రైల్వే ఎంప్లాయిస్ సంఘం గుంతకల్ డివిజన్ కార్యదర్శి, కెబికె రాజు, సంఘ తిరుపతి శాఖ ప్రధాన కార్యదర్శి, ఎంప్లాయిస్ సంఘ తిరుపతి శాఖ ఛైర్మన్ హేమంత్ రెడ్డి, పలువురు ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

## అనాధ శవాలకు వాహనాలు ఏర్పాటు చేయండి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 2 ప్రభాతవార్త :



తిరుపతి నగరంలోని గుంతలు పడిన తారు రోడ్లుకు ప్యాచ్‌లు వేసేందుకు ఒక వాహనాన్ని, అదే విధంగా నగరంలో మృతి చెందిన అనాధ శవాలను తరలించేందుకు ఒక వాహనాన్ని ఏర్పాటు చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరితకు వినతి పత్రాన్ని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ సమర్పించారు. తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో తారు రోడ్ల నందు ప్యాచ్లు వేయు మున్సిపల్ సిబ్బంది తారు రోడ్ల ప్యాచ్‌లకు సంబంధించి ఇప్పటి వరకు తోపుడు బండ్లు ఉపయోగిస్తున్నారని పనులు తొందరగా జరిగేందుకు, తారు, ఇసుక, గుల్ల సామాగ్రి తీసుకుని వెళ్ళుటకు ఒక కొత్త వాహనమును ఏర్పాటు చేయాలని, అదే విధంగా తిరుపతి నగరం నందు చనిపోతున్న అనాధ శవాలను తీసుకుని వెళ్ళుటకు కూడా నగర పాలక సంస్థ తరపున ఒక వాహనంను ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ కోరారు. కమిషనర్ హరిత స్పందిస్తూ వాహనాలు ఏర్పాటుకు పరిశీలించి తగు చర్యలు చేపడుతామన్నారు.

# సీఎం జగనన్న ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు : ఎమ్మెల్యే

ఓజిలి, జూన్ 2 ప్రభాతవార్త :

గడపగడపకు మన ప్రభుత్వం ఓజిలి మండలంలోని కుందా, తిరుమల పూడి గ్రామంలో కుందాం సర్పంచ్ ఎద్దల కనకదుర్గా రమణి, కుందం సొసైటీ అధ్యక్షులు రాజారాం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు ఈశ్వర్ రాజు రామచంద్రరాజు, తిరుమల పూడి సర్పంచ్ యకసిరి గోపాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సూలూరు పేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడపగడప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడప కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఏ ఇంటికి వెళ్లినా జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెడుతున్న పథకాల వల్ల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు. కొంత మంది ప్రజలు,



పక్కా గృహాల సమస్యలు, విద్యుత్ సమస్యలు, మంచి నీటి సమస్యలు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు తెలుపగా అక్కడికి, అక్కడే సమస్యలు పరిష్కరించారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని, హౌసింగ్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రవేశ పెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరికి అందజేయడమే గడప గడప యొక్క ముఖ్య ఉద్దేశమని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగు తుందని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జడ్పి టిసి సభ్యులుగుంట మడుగు రవీంద్ర రాజు, కుందా సర్పంచ్ ఎద్దల కనకదుర్గా రమణి, తిరుమల పూడి సర్పంచ్ యకసిరి గోపాలయ్య, ఎంపిడిఓ రజినీకాంత్, ఓజిలి ఎస్ఐ డి ఆదిలక్ష్మి, కుందాం సొసైటీ అధ్యక్షులు ఎద్దల రాజరామ్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు ఈశ్వర్ రాజు రామచంద్ర రాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశిరెడ్డి మదురెడ్డి, ఉచ్చూరు హరినాథ్ రెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, ముమ్మడి సుబ్బారావు యాదవ్, జరుగుమల్లి బాబు రెడ్డి, ఎంపిటిసి రఘు రామరాజు, సర్పంచ్ ఎల్లా సురేష్ రెడ్డి, ఈశ్వర రాజు చంద్ర రాజు, దాసరి రాజామోహన్, దాసరి దివ్య, మహిళా అధ్యక్షురాలు ప్రవీణా, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేర్లపాక సంఘటనలో మరో యువకుడు మృతి

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 2 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి-తిరుపతి రహదారిలోని మేర్లపాక మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనలో గాయపడి ఆసుపత్రికి తరలించిన వారిలో మరో యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.మహబూబాబాద్‌కు చెందిన వెంకటమ్మ (65) తన ముగ్గురు కుమారులు, ఇద్దరు మనుమరాళ్ళతో తిరుమలేశుని దర్శనానికి వచ్చి తిరుగు పయనంలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొనుటకు పయనమయ్యారు. మార్గ మధ్యంలో మేర్లపాక వద్ద ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే.అయితే దినేష్(40) ఆయన కుమార్తె భాన్విత్రాక్షరిలు(10)లు గాయాలతో ఆసుపత్రికి తరలించారు. అయితే కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్సకు చేరిన దినేష్ రాత్రి పరిస్థితి విషమించటంతో తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు.అక్కడ ఆతనుమృతి చెందాడని సమాచారం అందింది. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ముగ్గురు కుమారులు, ఇద్దరుమనుమరాళ్ళతో వచ్చిన వెంకటమ్మ ,కుమారుడు, మనవరాలు ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే మృతి చెందగా ముగ్గురుని ఆసుపత్రికి తరలించారు.

**శవాలు అప్పగింత:**

శ్రీకాళహస్తికి 15కిలోమీటర్ల దూరంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు మృతి చెందగా మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.శుక్రవారం కుటుంబసభ్యులు రాగా పోస్టు మార్టం జరిపి శవాలను అప్పగించారు. ఏర్పేడు పోలీసులు సిఐ శ్రీహరి, కానిస్టేబుల్ క్రాంతిలు పర్యవేక్షించారు.

## ఆస్తి పన్నులు సకాలంలో వసూలు చేయాల్సిందే : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 2 ప్రభాతవార్త




తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యూజర్ చార్జీలు, ఆస్తిపన్నులు సకాలంలో వసూలు చేయాల్సిందేనని శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులను ఉద్దేశించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నగరంలో అన్ని సచివాలయాల్లోని శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులతో యూజర్ చార్జీలు, ఆస్తిపన్ను వసూళ్ళపై ఎస్వీ యూనివర్శిటీ సెనెట్ హాల్‌లో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిమాండ్ మేరకు యూజర్ చార్జీలు, ఆస్తి పన్నులు వసూళ్ళు చేయాల్సిందేనని, యూజర్ చార్జీలు తక్కువ స్థాయిలో వసూళ్ళు చేసిన శానిటరీ కార్యదర్శులతో బాటు ఆ డివిజన్ అడ్మిన్లతో ప్రత్యేకంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ఇంటింటికి చెత్త సేకరిస్తున్నాము కాదా, ప్రతి వీధిలోకి చెత్త సేవరణ ఆటోలు వస్తున్నాయి. కదా మరేందుకు యూజర్ చార్జీలు సకాలంలో సక్రమంగా వసూలు చేయలేదని ప్రశ్నించారు. వాలంటీర్లు సహకరించడం లేదని కొంత మంది తెలుపగా, పని చేయని వాలంటీర్లను తొలగించమని వ్రాత పూర్వకంగా ఇస్తే తొలగిస్తామని, పని చేసే వాలంటీర్లను పెట్టుకుందామని చెబుతూ, మీరు పని చేయకుండా వాలంటీర్లపై నేపం వేస్తే మీ పై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హరిత హెచ్చరికులు జారీ చేసారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ళులు ఖాళీలుగా వున్నాయని అందువలన యూజర్ చార్జీలు వసూలు చేయలేదని చెప్పగా, సక్రమంగా పనులు చేయకుండా తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవన్నారు. 60 శాతం కన్నా తక్కువగా యూజర్ చార్జీలు వసూలు చేసిన శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న షాపులపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలన్నారు. అంతేకాకుండా చెత్తను బయట పడేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. అదే విధంగా ఆస్తి పన్నులను యజమానులకు సకాలంలో తెలియజేసి పన్నులు కట్టించాలని సూచిస్తూ, ఇకపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని చెబుతూ మీరు సక్రమంగా పని చేస్తూ, వాలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సకాలంలో యూజర్ చార్జీలను , ఆస్తి పన్నులను వసూళ్ళు చేయాలని సచివాలయ అడ్మిన్లు, శానిటరి కార్యదర్శులను ఉద్దేశించి తిరుపతి మున్సిపల్‌కార్పొరేషన్ కమిషనర్ హరిత స్పష్టం చేసారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌చంద్రమౌళీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డా. హరికృష్ణ, రెవెన్యూ అధికారులు కెవెల్ వర్మ సేతు మాధవ్, సుపరింటెండెంట్ పి. రవి, మేనేజర్‌చిట్టి బాబు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి, ఆర్ఐలు, శానిటరి ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

## క్వారీల్లో నీటిగుంతల వద్దకు వెళ్ళవద్దు :తహశీల్దార్

తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త :



వేసవి సెలవుల సరదా చిన్నారులుకు విషాదం కాకూడదని ఆందాన్ని నింపాలని తహశీల్దార్ సుధీర్‌రెడ్డి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తొట్టంబేడు గ్రామానికి సమీపంలోని సాంబయ్యపాళెం వెళ్ళే దారిలో అతిపెద్ద క్వారీగుంతలు ఉన్నాయని, వీటితో పాటు తంగేళ్ళపాళెం, కాశీక్వారీల్లో ఉన్న క్వారీ గుంతల్లో నీళ్ళునిండి ఉన్నాయని ఎవ్వరు కూడా మహిళలు దుస్తులు ఉతకడం కోసం వెళ్ళరాదని తెలిపారు. గతంలో రెండుసార్లు సాంబయ్యపాళెం గ్రామానికి వెళ్ళే దారిలో ఉన్న క్వారీలో బీడికాలనీ, శ్రీకాళహస్తిపట్టణానికి చెందిన నలుగురు మృతిచెందడంతో అక్కడ క్వారీలో ఎవ్వరు వెళ్ళరాదని బోర్డు ఏర్పాటు చేశారు. ఈపరిస్థితిని దృష్టిలో ఉంచుకుని క్వారీల్లో నీళ్ళు ఉన్న చోట తల్లిదండ్రులు తమ బిడ్డలను అక్కడకు పంపరాదని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ వివరించారు.

## సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలి : ఎంఎల్‌ఏ

తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త :



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దకన్నలి సచివాలయ పరిధిలోని పెద్దకన్నలి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయనకు ఎంపిపి ఉన్నం నిర్మల, వైస్ ఎంపిపి కన్నలిమల్లిక, మండల వైకాపా నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, కన్నలి ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పలువురు గ్రామస్తులు ఎంఎల్ఏకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ గడపగడపకు వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?లేదా? అని తెలుసు కున్నారు. ఈనెల అందరికి ఫించన్లు పంపిణీచేశారా లేదా అని తెలుసు కున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని లబ్దిదారులకు వెంటనే పథకాలు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.అనంతరం ఎంఎల్ఏను భారీగజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటిసి అర్చనాదేవి, మాజీ సర్పంచ్ మునిరత్నం, భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, ఎంపిటిసి పద్మ, సర్పంచ్ రమ, మధు, నరసింహనాయుడు, పాపయ్య, కోవిచంద్రయ్యనాయుడు, కొన్నలి రమేష్‌బాబు, భాస్కర్, భక్త, రత్నశేఖర్, మణి, సుబ్రమణ్యం, గంగాధరం, గుడ్లూరు వెంటకరామనాయుడు, చంద్ర పలువురు వైకాపా నాయకులుతో పాటు ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి, తహశీల్దార్ సుధీర్‌రెడ్డిపలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 193 మందికి ఉద్యోగాలు

పుత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త :



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 15 కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 193 మంది వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆ మేరకు దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ తప్ప మరెక్కడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు లేవని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగుల్లో ఉద్యోగావకాశాలను పెంచేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో స్కిల్ సమన్వయకర్త టి.నరసింహులు, డిఆర్‌డిఏ పిడి తులసి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పద్మజ, పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాశ్, డి.శంకర్, కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, స్కిల్ మెంటార్ రసూల్, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్య.. విద్యకు పునాది

రేణిగుంట, జూన్ 2, ప్రభాతవార్త :




ప్రాథమిక విద్య విద్యార్థుల అభివృద్ధికి పునాదులని ఇన్కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి అన్నారు. ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ తిరుపతి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, ఏర్పేడు రేణిగుంట మండలాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు చదువుచూ 10 వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిబ కనపరచిన విద్యార్థులకు రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాల నందు చదువుతూ 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి 10వ తరగతి నుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలని, పిల్లలు వారి యొక్క లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించడానికి ఇప్పటి నుండే ప్రయత్నాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి హరిబాబు, ప్రగతి డైరెక్టర్ కెవి రమణ, కందాడు, బండారుపల్లి ప్రధాన ఉపాధ్యాయులు రెడ్డయ్య, రమణ, ఉపాధ్యాయులు శుబశ్రీ, మురళి, ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా అమ్మణ్ణికి సారెలు

సూళ్లూరుపేట, జూన్ 2 ప్రభాతవార్త



శ్రీచెంగాళమ్మ తిరునాళ్లకు సంబంధించి అమ్మణ్ణికి సారెలు సమర్పించే ప్రక్రియను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గమండ్లవీధి నుంచి అమ్మణ్ణికి రూ.30వేల విలువ చేసే నెయ్యితో పాటు చీర, పసుపు, కుంకుమ సమర్పించారు. అలాగే రెండు లక్షలు విరాళాన్ని కూడా అందజేశారు. కోళ్లమిట్ట ప్రాంతం నుంచి కూడా అమ్మణ్ణికి సారె తీసుకొచ్చారు. ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు అమ్మణ్ణికి తీసుకొస్తున్న సారెలను స్వాగతించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదరపాక బాలయ్య, కర్లపూడి సురేష్‌బాబు, కె.మునిరాజా, కె.వెంకటకృష్ణయ్య, రత్నంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు అండగా ఉంటాం

-మెరుగైన వైద్యం అందించాలి -టిడిపి నేత సుగుణమ్మ

తిరుపతి,జూన్ 2 ప్రభాతవార్త:



గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం జరిగిన రావిచెట్టు కూలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన తిరుపతి వాసులు త్వరగా కోలుకోవాలని, వారికి మెరుగైన వైద్యం అందించాలని టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ కోరారు. క్షతగాత్రులకు టిడిపి అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. రుయాలో చికిత్స పొందుతున్న తిరుపతి వాసులు భవానీనగర్‌కు చెందిన చంద్రశేఖర్, గాంధీరోడ్డుకు చెందిన బేబి, నిహారికలును శుక్రవారం సుగుణమ్మ పరామర్శించారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులను కోరారు.

## పార్టీ బలోపేతం దిశగా పనిచేద్దాం

-అఖిలపక్షం సమావేశంలో టిడిపి నేతలు

తిరుపతి,జూన్ 2ప్రభాతవార్త:



తిరుపతిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకునే దిశగా అన్ని విభాగాలు కలసికట్టుగా పనిచేయాలని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా ముందుకు నడవాలని టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ పిలుపు నిచ్చారు. తిరుపతిలోని పద్మావతి పురంలో టిడిపి అనుబంధవిభాగాలు టిఎన్‌టియుసి, తెలుగుయువత, కార్మిక సంఘాలు అఖిలపక్షం సమావేశమయ్యాయి. గత నాలుగేళ్ళలో వైసిపి ప్రభుత్వంలో ప్రజలు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధిని అడ్డుకోవడం, కార్మికుల కష్టాలు తదితరవాటిపై చర్చించారు. ఎన్నికలనాటికి అన్ని వర్గాలు టిడిపిని ఆదరించేలా పనిచేయాలన్నారు. అనంతరం టిఎన్‌టియుసి కార్యవర్గం, సమర్ధవంతమైన నాయకుల పనితీరును అభినందించారు.

## తెలుగు, తమిళ ఆరాధ్య దేవత పొన్నియమ్మన్

– ఇరకం దీవిలో రథోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

తడ, జూన్ 2 ప్రభాతవార్త :



ఆంధ్రా, తమిళనాడు ప్రాంతాల్లో గ్రామశక్తి పొన్నియమ్మన్ ఆరాధ్యదేవతగా ఉంది. ముఖ్యంగా పులికాట్ సరస్సు తీరప్రాంతంలో పలుచోట్ల పొన్నియమ్మన్ ఆలయాలు ఉన్నాయి. ప్రత్యేకించి చుట్టూ ఉప్పునీళ్లతో నిండిన తడ మండలం ఇరకందీవిలో పొన్నియమ్మన్ రథోత్సవం ఒక ప్రత్యేకత కలిగి ఉంది. పడవలపై వెళ్లి ఈ ఉత్సవాలను వీక్షించడం కొన్నేళ్లుగా జరుగుతోంది. ఈ సారి కూడా పొన్నియమ్మన్ రథోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇరకం ప్రధాన గ్రామంతో పాటు తిరువెంకటనగర్ కుప్పం ప్రజలు కూడా ఈ ఉత్సవాల ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నారు. ఇప్పటికే ఈ ఉత్సవానికి సంబంధించి కంకణం కట్టడం, ప్రవేశబలి, యాగశాల పూజలు సంప్రదాయబద్ధంగా జరిపారు. ప్రస్తుతం ప్రతిరోజు పడవలపై విద్యుత్ అలంకరణలు, ఇతర సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 6న దీవిలో యల్లమ్మ రథోత్సవం నిర్వహిస్తారు. తర్వాత పోలేరమ్మను మన్నడిలో నిలపడం, పోలేరమ్మ కలశాన్ని సాగనంపడం వంటి కార్యక్రమాలు చేస్తారు. అనంతరం 7వ తేదీన ఉదయం పొన్నియమ్మకు మహాభిషేకం ఘనంగా నిర్వహించి ఆ తర్వాత పొన్నియమ్మ సన్నిధిలో పొంగళ్ల కార్యక్రమం అతి వైభవంగా చేస్తారు. బాణాసంచా వేడుకలు, ఇతర జాతర కార్యక్రమాలు జరుపుతారు. 7వ తేదీ రాత్రి పొన్నియమ్మన్ రథంపై ఆరోహణం చేసి తిరువీది ప్రదక్షణం చేస్తారు. 8వ తేదీ ఉదయం దాకా రథోత్సవం ఉంటుంది. ఆ తర్వాత దీపారాధన, రథోత్సవం తిరిగి ఆలయ సన్నిధికి చేర్చే కార్యక్రమాలు చేపడతారు. మంగళవాయిద్యాలు, పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు, బాణాసంచా వేడుకలు, గరగాటం నృత్యాలు, బ్యాండుమేళాలు వంటివి ఎక్కువ తమిళనాడు బృందంచే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపెద్దలు రెండు రాష్ట్రాల పరిధిలో కరపత్రాల ద్వారా ఇప్పటికే ప్రచారం చేశారు. నాటు పడవలతో పాటు పులికాట్ సరస్సులో ప్రత్యేక బోట్లు కూడా ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, రెండు రోజుల పాటు తమ దీవికి వచ్చి పొన్నియమ్మన్ రథోత్సవాన్ని వీక్షించాలని గ్రామపెద్దలు విజ్ఞప్తి చేశారు.

## పురిటి బిడ్డకు ప్రాణం పోసిన అమర వైద్యులు

రేణిగుంట, జూన్ 2, ప్రభాతవార్త :



అతి తక్కువ బరువుతో జన్మించిన పురిటి బిడ్డకు రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆసుపత్రి వైద్యులు తమ అమృత హస్తాలతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్నితో వైద్యం చేసి బిడ్డ ప్రాణాలు కాపాడి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించి అందరి చేత భేష్ అనిపించుకుంటున్నారు. అమర హాస్పిటల్ నందు పురిటి బిడ్డ కేవలం కేజీ బరువు, తీవ్రమైన అస్వస్థతతో శ్వాస తీసుకోలేని స్థితిలో జన్మించింది. తల్లిదండ్రులు తమ బిడ్డను వైద్యం కోసం అమర ఆసుపత్రిలో చేర్పించారు. అమర హాస్పిటల్‌లోని శిశు సంరక్షణ డిపార్ట్మెంట్ వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ బృందం తక్షణం స్పందించి అడ్వాన్స్ లెవెల్ 3 ఎన్ఐసియు కేర్ ద్వారా ఎంతో శ్రమపడి వైద్యం చేశారు. బిడ్డ బరువు 2 కేజీల 300 గ్రాములతో పూర్తి ఆరోగ్యవంతంగా తల్లిదండ్రులకు అప్పగించారు. దక్కడు అనుకున్న తమ బిడ్డను పూర్తి ఆరోగ్యంతో పునర్జీవం పోసిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్, వైద్య బృందానికి, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వేణుగోపాల్, అమర్ ఆసుపత్రి యాజమాన్యానికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

## తెప్పపై శ్రీ పద్మావతి అమ్మవారి అభయం

తిరుచానూరు, జూన్ 2 ప్రభాతవార్త :



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం శ్రీ పద్మావతి అమ్మవారు తెప్ప పై విహరించి భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్ద గల నీరాడ మండపంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో అమ్మవారు మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, సూపర్‌టెండెంట్స్ శేష గిరి, మధు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుభాష్, గణేష్, ప్రసాద్, అశోక్, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో స్టాండ్స్‌లో ఉచిత పార్కింగ్, రవాణా

-ఆటో డ్రైవర్లు గేటు ఫీజు ఎంఎల్‌ఏ చెవిరెడ్డి చెల్లించారు!

చంద్రగిరి, జూన్ 2 ప్రభాతవార్త: చంద్రగిరి పంచాయతీలోని ఆటో డ్రైవర్లు ఇకపై గేటు ఫీజు చెల్లించే అవసరం లేకుండా ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చెల్లించారని వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకోదండరామాలయం వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గల ఆటోడ్రైవర్లకు సుమరు నెలకు రూ.15 వేలు సంపాదిస్తున్నప్పటికీ అందులో గేటు ఫీజు రూ.3 వేలు చెల్లించాల్సివస్తున్నట్లు ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీంతో స్పందించిన ఎంఎల్ఏ గేటు టెండర్‌ను తానే చెల్లించడానికి అంగీకరించినప్పటికీ అప్పటికే టెండరు ప్రక్రియ పూర్తి కావడంతో టెండరుదారుడు పంచాయతీకి చెల్లించిన రూ.7.10 లక్షలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో



ఇకపై ఆటో నుండి గేటు వసూలు చేయవద్దని అన్నారు. ఏడాది కాలానికి పంచాయతీ గేటు చెల్లించాలిసన అవసర లేకుండా తమకు చేయూతనిచ్చిన ఎంఎల్ఏకి, ఎంఎల్ఏ అభ్యర్థి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డ్రైవర్లకు యూనిఫారమ్ పంపిణీ చేయగా, కార్మికులు మోహిత్ రెడ్డి, ఎంపిపి, జడ్పీటిసిలను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమేంద్ర కుమార్ రెడ్డి, జడ్పీటిసి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా, వైసిపి చంద్రగిరి డివిజన్ కన్వీనర్ కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, కార్మిక విభాగం మండల అధ్యక్షుడు సంధిపుట్టి బాలకృష్ణ, అగరాల సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, దక్షిణ మండల డివిజనల్ కన్వీనర్ అగరాల దేవారెడ్డి, కొత్తపాటి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.